ప్రజాశక్తి
ఆదివారం 5, ఫిబ్రవరి 2022
5
అనంతపురం



వందశాతం సబ్సిడీతో డ్రిప్పు ఇవ్వాలని వినతి

ఉరవకొండ : వందశాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుని కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరారు. అలానే రాయలసీమలో డ్రిప్‌పై ఆధారపడి పంటలు సాగు చేసుకునే రైతులకు వందశాతం సబ్సిడీతో సబ్సిడీ ఇవ్వాలని విన్నవించారు. కృష్ణానదిపై సంగమేశ్వరం వద్ద నిర్మిస్తున్న తీగల వంతెనకు బదులు బ్యారేజి కం బ్రిడ్జిని నిర్మించాలన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, భార్గవ, నవీన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, వైసిపి మండల కన్వీనర్ బసన్న, రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, కరణం భీంరెడ్డి, పాల్గొన్నారు.

గాడితప్పిన రెవెన్యూ పాలన..!



హిందూపురం తహశీల్దారు కార్యాలయం

శ్రీ సత్యసాయి జిల్లాలోనే అతిపెద్ద పట్టణం, సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం హిందూపురం. 14 గ్రామ పంచాయతీలు, 16 రెవెన్యూ గ్రామాలు, 35 మజరా గ్రామాలు, ఒక మేజర్ గ్రామ పంచాయతీలో మండలం విస్తరించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 1,51,677, రూరల్ మండల జనాభా 51,861, మొత్తం జనాభా 2,03,538. గడిచిన 13 సంవత్సరాల్లో జనాభా లక్షకు పైగా పెరిగివుండవచ్చని అంచనా. ఇంత పెద్ద మండలంలో రెవెన్యూ పాలన పూర్తిగా గాడితప్పింది. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు పోస్టు గత ఏడాది ఆగష్టు నుంచి ఖాళీగా ఉంది. ఆర్ఐ, ఇతర పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. సకాలంలో పనులు జరగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అక్కడ అందరూ ఎఫ్ఎసిలే
కలెక్టర్ కార్యాలయంలో వారికి కొలువు
ఇబ్బంది పడుతున్న పురం ప్రజలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తహశీల్దారుగా రావాలంటే గతంలో పోటీ పడేవారు. ప్రస్తుతం ఇక్కడికి తహశీల్దారుగా రావాడానికి ఎవ్వరూ అసక్తి చూపడంలేదన్న చర్చనడుస్తోంది. ఇక్కడ రెగ్యులర్ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీనివాసులు గత ఏడాది ఆగష్టు నెలలో సాధారణ బదలీల్లో భాగంగా వెళ్లారు. దీంతో చిలమత్తూరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న నాగరాజును అదనపు బాధ్యతల కింద (ఎఫ్ఎసి) హిందూపురం తహశీల్దారుగా నియమించారు. ఈయనను అదనపు బాధ్యత కింద పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపారు. ఇక్కడ మళ్లీ పోస్టు ఖాళీ ఏర్పడడంతో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న డి.ప్రసాద్‌ను జనవరి 14 నుంచి హిందూపురం ఇన్‌ఛార్జి తహశీల్దారుగా ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న అమరేంద్రను పుట్టపర్తి జిల్లా కలెక్టర్ సిసిగా డిప్యూటేషన్ వేశారు. దీంతో లేపాక్షి మండల ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌రెడ్డిని హిందూపురం ఆర్ఐగా డిప్యూటేషన్ విధానంలో నియమించారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దారుగా రెండు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన మైనుద్దీన్‌ను పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వేశారు. దీంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ హారతిని హిందూపురం మండలంతో పాటు మడకశిర, లేపాక్షి మండలాలకు ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇలా హిందూపురం తహశీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముఖ్య అధికారులను ఇతర మండలాల కార్యాలయాలకు ఇన్‌ఛార్జిలుగా నియమిస్తుండడంతో ముఖ్య అధికారులైన తహశీల్దారు, ఆర్ఐ పోస్టుల ఖాళీలు ఏర్పడుతున్నాయి.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

నెలలు గడిస్తున్నా తహశీల్దారు, ఆర్ఐ పోస్టులు భర్తీ చేయకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా హిందూపురం తహశీల్దారు కార్యాలయానికి కుల, ఆదాయ, ఒబిసి, ఇబిసి ఇతర సర్టిఫికెట్ల కోసం సుమారు 4 వేల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. మ్యుటేషన్, పాసుపుస్తకాలు తదితర పనుల కోసం రైతులు, రియలెస్టేట్ వ్యాపారుల దరఖాస్తులు వస్తుంటాయి. రియలెస్టేట్ వ్యాపారుల పనులు మాత్రం ఎఫ్ఎసిలుగా ఉన్నా వారే చకచకా చేసేస్తుంటారు. ఇతర పనులు మాత్రం తాము చేయలేమంటూ చేతులెత్తేస్తుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హిందూపురం తహశీల్దారు కార్యాలయానికి రెగ్యులర్ అధికారులను నియమించి.. గాడితప్పిన పాలనను దారిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారుల నిర్లక్ష్యం..పింఛన్లకు దూరం..

హిందూపురం మండలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి ఎంతోమంది సామాజిక పింఛన్లకు నోచుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. చాలామందికి 1000 చదరపు అడుగుల ఇల్లు ఉందని పింఛను నిలిపి వేశారు. 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను కేటాయించింది. పైసా పైసా కూడబెట్టుకుని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఒకే ఇంట్లోనే బాగాలు చేసుకుని కుమారులు నివాసముంటున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నిబంధనలతో మేల్కొన్న పేదలు వారికి కేటాయించిన స్థలాన్ని భాగ పరిష్కారం చేసివ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించక పోవడంతో చాలామంది సామాజిక పింఛన్లకు దూరమయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తదితరులు

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

6న కలెక్టరేట్ ఎదుట మహాధర్నాను జయప్రదం చేయండి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విధానాలతో అంగన్‌వాడీ సెంటర్లను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నాయని తెలిపారు. సంవత్సరాల కొద్దీ టీఏ బిల్లులు పెండింగ్‌లో ఉండడం, పర్మినెంట్ బిల్డింగ్ లేక అద్దెలు చెల్లించలేక అంగన్‌వాడీ వర్కర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. 4 సంవత్సరాలు గడిచినప్పటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఫేస్ యాప్ హాజరు ఉపసంహరించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతు భరోసా కేంద్రాలతో ఎఫ్‌పిఒలను అనుసంధానం చేస్తాం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పిఒలు) రైతు భరోసా కేంద్రాలతో అనుసంధానం చేసి రైతాంగానికి మరింత చేరువయ్యేలా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీటీ ప్రత్యేక విద్యార్థుల పాఠశాలలో నిర్వహించిన రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమ్మేళనానికి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు నిర్వహించుకునే ఎఫ్‌పిఒలు బలపడినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎఫ్‌పిఒలు అంతర్జాతీయ స్థాయిలో ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిరుపయోగంగా ఉన్న మార్కెట్ కమిటీల స్థలాలు, నిల్వ వసతులను ఎఫ్పీవోలు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. వేర్ హౌస్‌ల ఏర్పాటు కోసం ఎఫ్‌పిఒలకు సబ్సిడీ పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వమే తయారు చేసిన మార్కఫ్ బ్రాండ్ ద్వారా ఎఫ్‌పిఒల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలో రూ.1250 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాట్లకు నిర్మాణాలు ప్రారంభించనున్నామన్నారు. సూక్ష్మ సేద్యం విషయంలో అనంత జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

అంగన్ వాడీల్లో చిరుధాన్యాల ఆహారం అందిస్తాం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా పిల్లలు, గర్భిణులకు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని అంగన్‌వాడీల ద్వారా అందించే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. జిల్లాలో ఎఫ్‌పిఒలు బలంగా ఉన్నాయన్నారు. మరింత అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా మహిళలు నిర్వహించే ఎఫ్‌పిఒల పనితీరు బాగుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రితో పాటూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కోఆపరేటివ్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, ఏడీసీసీ చైర్‌పర్సన్ లిఖిత, నాటక అకాడమీ చైర్ పర్సన్ హరిత, ఆర్టీసీ రీజనల్ చైర్ పర్సన్ మంజుల, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, రమణారెడ్డిలు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి, ఎఫ్‌పిఒల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

కల్తీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

కల్తీ, నాసిరకం పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలని సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట 70 వేల హెక్టార్లలో విస్తారంగా సాగు చేశారన్నారు. గత ఏడాది పత్తి పంటకు మంచి ధర రావడం వల్ల ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. ఎప్పుడూ లేనివిధంగా సాగు పెరగడంతో పత్తి విత్తన కంపెనీలు రైతుల అవసరాలను ఆసరా చేసుకుని నాసిరకం నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను నిలువు దోపిడీ చేశారన్నారు. జిల్లాలోనే కాకుండా తెలంగాణ ఇతర ప్రాంతాల నుంచి అనేక రకాల నాసిరకం విత్తనాలు రైతులకు విక్రయించారని తెలిపారు. రైతులు రూ.350 కోట్ల మేరకు పెట్టుబడుల రూపంలో నష్టపోయారని తెలిపారు. అధికారుల చలువతోనే నకిలీ విత్తనాలు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ఈ వాదనకు బలం చేకూర్చే విధంగా నకిలీ విత్తన కంపెనీలపై వ్యవసాయ శాఖ అధికారులు ఒక్క చోట కూడా దాడులు చేసి, చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. జిల్లాలో నాసిరకం పత్తి విత్తనాల వల్ల పామిడి, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, కొనుగట్టపల్లి, దిగువపల్లి, ఎగువపల్లి, బందార్లపల్లి, బాపణపల్లి, తిమ్మేపల్లి, తిమ్మాపురం, తేరన్నపల్లి, పెద్దమడమల తదితర గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ముందస్తుగా విత్తన కంపెనీలపై చర్యలు తీసుకుని ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదన్నారు. ప్రభుత్వం పరిశీలించి నకిలీ నాసిరకం పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. పత్తి, పప్పుశెనగ, మిరప పంటలను వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాలో చేర్చాలన్నారు. పత్తి మిరప నష్టపోయిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా కేంద్రాల ద్వారా పత్తి, మిరప, ఇతర రకాల పంటల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించాలని కోరారు. స్పందించిన మంత్రి అధికారులతో పరిశీలన చేయించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమకు నష్టం

కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయంపై నిర్మిస్తున్న అప్పర్ భద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ జిల్లాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం నిబంధనలను పక్కనపెట్టి రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడానికి కుట్ర చేస్తోందన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేపడితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ కుట్రపూరిత రాజకీయాల కోసం ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించడంతోపాటు వాటి నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. తుంగభద్ర డ్యామ్‌ను 133 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారని డ్యామ్‌లో కూడిక పేరుకుపోవడంతో కేవలం నోరు టీఎంసీల సామర్థ్యంతో ఉందన్నారు. కర్ణాటక రాష్ట్రానికి కేటాయించిన నీటి సామర్థ్యం కంటే అదనంగా వాడుకుంటున్నారని, రాష్ట్రానికి కేటాయించిన 32.5 టీఎంసీల నీటిని పూర్తి స్థాయిలో ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరఫరా చేయలేదన్నారు. తుంగభద్ర డాం కింద రాయలసీమలోనే అనంతపురం, కడప, కర్నూల్ జిల్లాల్లో 5,81,423,934 ఎకరాల ఆయకట్టు భూమిని రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్ట్ మొదటి నిర్మాణం ద్వారా17.4 టీఎంసీలు రెండవ దశ నిర్మాణం ద్వారా 29.9 టీఎంసీలు నీటిని నిబంధనలకు విరుద్ధంగా తోడుకుంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రం ఈ విధంగా చేయడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి, పోతిరెడ్డిపాడు, రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ కింద ఉన్న ఆయకట్టు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోవాల్సిసన పరిస్థితి ఉందన్నారు. అప్పర్ భద్ర నిర్మాణ పనులను ఆగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్ డ్రాఫ్ట్ బడ్జెట్‌పై చర్చ

ప్రజాశక్తి-అనంతపురం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డ్రాఫ్ట్ బడ్జెట్‌పై మేయర్ ఛాంబర్‌లో శనివారం స్థాయిసంఘం నిర్వహించి చర్చించారు. ముందుగా సమావేశానికి అధ్యక్షత వహించిన కమిషనర్ భాగ్యలక్ష్మి డ్రాఫ్ట్ బడ్జెట్‌ను సభ్యులకు చదివి వినిపించారు సభ్యులు వెలుగు ఇచ్చిన సందేహాలకు కమిషనర్ భాగ్యలక్ష్మి నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ కమిషన్ లాగిన్‌లోనే చాలా ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని కార్పొరేటర్లు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. కావున అధికారులు సకాలంలో పంపిస్తున్నారా.. ఎందుకు జాప్యం జురుగుతోందో చెప్పాలని కోరారు. అలాగే టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో అవినీతి అంశాలపై రోజూ పత్రికలలో కథనాలు వెలువడుతున్నాయన్నారు. టౌన్‌ప్లానింగ్‌లో అవినీతిని అరికట్టటానికి సిబ్బందిని మార్చుడంగానీ, చర్యలుగానీ చేపట్టాలని ఆదేశించారు. అలాగే సమాచారం ఇచ్చినా సమావేశానికి హాజరుకాని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

గ్రామాల్లో అవగాహన సదస్సులు



ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి-ఉరవకొండ

క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోందని వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో ఉన్న బెతెస్త ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్యాన్సర్ నిర్మూలన విధివిధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం, ఆరోగ్యానికి హాని కలిగించే వ్యక్తిగత అలవాట్లు జీవన శైలిలో మార్పుల వల్ల క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. దాదాపు ప్రతి సంవత్సరం ఎనిమిది లక్షల మంది కొత్త క్యాన్సర్ రోగుల కేసులు నమోదు అవుతున్నట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్లు, ఖైనీ, గుట్కాల వినియోగం వల్ల వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎండి షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, పాఠశాల కరస్పాండెంట్ బెన్సన్, ఎంఎల్‌హెచ్‌పి భారతి, ఎఎన్ఎం చాముండేశ్వరి, కమ్యూనిటీ ఆర్గనైజర్ భగవాన్ దాస్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని 15 సచివాలయం పరిధిలో ఉన్న వైద్య సిబ్బంది క్యాన్సర్ వ్యాధిపై శనివారం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ వచ్చిన భయపడాల్సిన అవసరం లేదన్నారు. క్యాన్సర్‌ను గుర్తించిన వెంటనే ప్రాథమిక స్థాయిలోనే మంచి వైద్యం అందుబాటులో ఉందన్నారు. బొమ్మనహాల్, ఉద్దేహాల్, ఉంతకల్, దేవగిరి, బల్లలగుడ్డం, గేనేహాల్, లింగదహాల్, గోవిందవాడ, దర్గాహొన్నూర్, కళ్లహోళ, కురవల్లి, నేమకల్లు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

అనంతపురం : మారుతున్న జీవన శైలే క్యాన్సర్‌కు కారణమని బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె క్రిష్ణకిశోర్ తెలిపారు. శనివారం స్థానిక రుద్రంపేటలోని బాలాజీ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టరు ప్రసూన క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు క్యాన్సర్‌పై అవగాహన కల్పించి సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె క్రిష్ణకిశోర్

రాయదుర్గం లాకప్ డెత్‌పై
నిష్పక్షపాతంగా విచారించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలోని పోలీస్‌స్టేషన్‌లో జనవరి 17న మృతిచెందిన కురుబ రామాంజనేయులు లాకప్ డెత్‌పై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి సుబ్బన్న, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రసూల్ శనివారం ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. జనవరి 22, 28 తేదీల్లో తమతోపాటు మరో ఇద్దరు వేదిక ప్రతినిధులు చంద్రశేఖర్, విజయభాస్కర్ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ ప్రభుత్వ ఆసుపత్రి, కళ్యాణదుర్గం పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయం సందర్శించడంతోపాటు పోలీసు అధికారులను, మృతుని సహనిందితుడు శ్రీనివాసులను కలిసి రామాంజనేయులు విచారించినట్లు తెలిపారు. అంతేకాక సనప గ్రామం వెళ్లి రామాంజనేయులు కుటుంబ సభ్యులతో కూడా సమాచారాన్ని సేకరించామన్నారు. పోలీసుల సమాచారం మేరకు 15న రాత్రి శ్రీనివాసులు, రామాంజనేయులుపై తోట వద్ద గొర్రెల దొంగతనానికి వెళ్లి స్థానికులకు పట్టుబడ్డారన్నారు. మరుసటి రోజు వారిని పోలీసులకు అప్పగించగా గొర్రెల దొంగతనం కేసులో సెక్షన్ 379 క్రింద నిందితులను అరెస్టు చేసి స్టేషన్‌లోని కంప్యూటర్ గదిలో ఉంచినట్లు తెలిపారు. 16న అర్ధరాత్రి కంప్యూటర్ గదిలో ఉన్న శ్రీనివాసులు కేకలు వేయగా రామాంజనేయులు ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసినట్లు తెలిసిందన్నారు. రామాంజనేయులును ఆసుపత్రికి తీసుకెళ్లగా మరణించినట్లు చెప్పారన్నారు. సెక్షన్ 176 కింద లాకప్ మరణం రికార్డు చేసినట్లు చెప్పారు. అయితే 20 కేసులు ఉన్న రామాంజనేయులు ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడం నమ్మశక్యంగా లేదన్నారు. ఘటనపై జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌తో విచారించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ శ్రీదేవి

గ్యాస్ వినియోగంపై అవగాహన

రాయదుర్గం : వంటగ్యాస్ వినియోగంపై శనివారం రాయదుర్గంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ శ్రీదేవి గ్యాస్ వినియోగంపై వివరించారు. అలాగే గ్యాస్ సిలిండర్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంస్థ శిక్షకులు ప్రసాద్ ప్రయోగాత్మకంగా వివరించారు. నిర్వాహకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వంటగ్యాస్ వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రచురించిన ఇండేన్ గ్యాస్ కరపత్రాలు, పుస్తకాలను శిబిరంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల విద్యాశాఖ అధికారిని నాగమణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్యాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

హార్మోనిస్టుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న నారాయణ

నార్పల : మండలంలోని బి.పప్పూరు గ్రామానికి చెందిన హార్మోనిస్టు మాల్యమంతం నారాయణ స్వామి డాక్టరేట్ అందుకున్నారు. ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా వారు సంయుక్తంగా డాక్టరేట్ అందించారు. ఈమేరకు శనివారం హైదరాబాదులోని తెలంగాణా సరస్వతి భవన్‌లో తెలంగాణా ఫిలిం ఛాంబర్ సభ్యులు రామకృష్ణగౌడ్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఫౌండర్ ఆకుల రమేష్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈసందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ78 ఏళ్లలో తనకు డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జెఎన్‌టియు బి.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.ఫార్మసీ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్.19) రెగ్యులర్ పరీక్ష పలితాలు, బీ.ఫార్మసీ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్.15) సప్లిమెంటరీడ పరీక్ష పలితాలను శనివారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్షా పలితాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

పిఎం కిసాన్ అకౌంట్ ఓపెన్ చేసుకోండి..

ఆత్మకూరు : మండల వ్యాప్తంగా ఉన్న రైతులు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం నుంచి పిఎం కిసాన్ అకౌంట్లు ఓపెన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం, మంగళవారం ఉదయం 11 గంటలకు బ్యాంకు అకౌంట్లు లేని రైతులు తమ ఆధార్‌ను తీసుకొచ్చి అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని కోరారు. మండల అన్ని గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాడికి ఎస్ఐగా గురుప్రసాద్‌రెడ్డి

యాడికి : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా గురుప్రసాద్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న గురుప్రసాద్‌రెడ్డిని ఇక్కడికి నియమించారు. దీంతో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికడతానన్నారు. ప్రజల శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎవరైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే లక్ష్యం

ఉరవకొండ : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని విడపనకల్ ఎంపిడిఒ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సభా భవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పర్వతప్ప ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2030నాటికి సాధించాల్సిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల గురించి వివరించడంతో పాటు వాటిని సాధించడానికి చేయాల్సిన విధివిధానాలపై ప్రణాళికలు రూపొందించడం, అమలు చేయాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.

పోస్టర్లను ఆవిష్కరించిన నగర మేయర్

అనంతపురం కార్పొరేషన్ : ఈనెల 10న జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న సాఖిబ్ ఇక్బాల్ షామి తెహరిక్ ఫైజానే అహ్లే బైత్ తహ పూజ్ అఖాయిదే ఆహ్లే సున్నత్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన పోస్టర్లను మేయర్ మొహమ్మద్ వసీం సలీం శనివారం తన ఛాంబరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల కాన్ఫరెన్స్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సభలు, సమావేశాల్లో అల్లాహ్ కృప, కటాక్షాలు ఉంటాయనితెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా కో-ఆప్షన్ నెంబర్ శంషుద్దీన్ నాయకులు, సుఖేష్ షేక్ష మత పెద్దలు గౌస్‌పీర్, నూర్ భాయ్, షబ్బీర్ సయ్యద్, హుస్సేన్ పీరా, షేక్షావలి, అస్లం, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న మేయర్ వసీ

నోరు మెదపని నేతలు

కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయంపైనా గప్‌చుప్



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లో ఉన్నాం... వారి బాగు కోసం జీవితాలను అర్పిస్తున్నాం... అంటూ ప్రకటనలు చేసే నేతలు... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించి 2023-24 బడ్జెట్‌లో జిల్లాకు మంచి చేయకపోగా నష్టం చేకూర్చే నిర్ణయం తీసుకున్నా.. నేతలు మాత్రం నోరు మెదపటం లేదు. నిత్యం క్షామ పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఏకైక జలవనరుగా ఉన్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నష్టం జరిగే పరిస్థితి కనిపిస్తున్నా... నేతలెవరూ ఇది అన్యాయమని చెప్పే పరిస్థితి లేకపోవడం శోచనీయం.తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరందించే తుంగభద్ర డ్యామ్ పై భాగంలో కర్నాటక ఇప్పటికే ప్రాజెక్టులను నిర్మిస్తోంది. దీనిపై ఇప్పటికే ఒకింత ఆందోళ న ప్రజల్లో ఉంది. తుంగభద్ర డ్యామ్ ఎగువ భాగంలో ప్రాజెక్టులు చేపడితే ఎప్పుడైనా వర్షాభావ పరిస్థితులు నెలకొంటే దిగువకు నీరొచ్చే పరిస్థితి ఉండదు. దీని వలన వర్షాభావ పరిస్థితుల సమయంలో తాగునీటి సమస్య జిల్లాలో ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంది. ఇది నష్టం జరుగుతుందని తెలిసినా అధికార, ప్రతిపక్ష నేతలిద్దరూ మిన్నకుండటం గమనార్హం. సిపిఎం ఒక్కటే దీనిపై స్పందిస్తోంది. దీనిపై అన్ని రాజకీయ పక్షాలతోనూ సదస్సును నిర్వహిస్తోంది. కలిసొచ్చే వారితో కలిసి పోరాటానికి సిద్ధమవుతోంది. ఇకపోతే కేంద్ర బడ్జెట్‌పై జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కర్నాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5300కోటన్లు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. అదే పక్కనే ఉన్న రాయలసీమ జిల్లాల్లో వెనుకబడిన ప్రాంతాలకు మాత్రం విభజన హామీలో ఉన్నా కేటాయింపులు మాత్రం శూన్యం. అంతక మునుపు ఇచ్చే రూ.50 కోట్లు కూడా ఇప్పుడు ఇవ్వడం లేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయంకు కూడా నిధులు నామ మాత్రంగానే కేటాయించారు. రూ47 కోట్లు నిధులు కేటాయించారు. ఇవి ఏమూలకూ సరిపోని పరిస్థితి నెలకొంది. గతేడాది కూడా రూ.56 కోట్లు కేటాయించి రూ.13 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. ఇవి సాధారణ పరిపాలనకు సరిపోదు. ఇప్పటికే పలుమార్లు విద్యార్థులు మౌలిక సదుపాయలు లేవని ఆందోళనలు వ్యక్త చేశారు. ఈ నిధులతో మౌలిక సదుపాయల కల్పన ఈ ఏడాదీ కల్పించే పరిస్థితులు లేవన్నది స్పష్టమవుతోంది. శాశ్వత బోధనా సిబ్బంది సైతం లేరు. రైల్వే బడ్జెట్‌లో గుంతకల్లు డివజన్‌కు ప్రాధాన్యత లేదు. పాత లైన్లకు సైతం నిధులు కేటాయింపులు ఆశించినంత జరగలేదు. ఈ రకంగా కేంద్ర బడ్జెట్‌లో ప్రతి ఏడాది లాగానే ఈసారి నిధుల కేటాయింపుల్లో జల్లాకు తీరని అన్యాయం జరిగింది.దీనిపై పెదవి విప్పేందుకు అధికార,ప్రతిపక్ష పార్టీల నేతలెవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.జిల్లా ప్రధాన సమస్యలపై ఒత్తిడి లేకపోవడంతో అధికార బిజెపి తనప్రాధాన్యతలకు అనుగుణంగా ఓట్లను దృష్టిలోపెట్టుకుని కేటాయింపులు జరుపుతూ ఉంది. వెనుకబాటు తనంపై రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించిన బిజెపి నాయకులు కూడా ఈ ప్రాంతానికి నిధుల కేటాయింపులు జరగకపోవడంపైనా స్పందించడం లేదు.

సచివాలయ సిబ్బంది మూడుసార్లు బయోమెట్రిక్ వేయాలి

ప్రజాశక్తి-పుట్లూరు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

మండలంలోని సచివాలయ సిబ్బంది రోజుకు మూడుసార్లు బయోమెట్రిక్ వేయాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది రోజూ తప్పనిసరిగా ఉదయం 10 గంటలలోపు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అలాగే మధ్యాహ్నం మూడు గంటలకు ఒకసారి, 5గంటల తర్వాత ఒకసారి బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరుతోపాటు యూనిఫాం, ఐడి కార్డులు, బ్యాడ్జీలు తప్పనిసరిగా దరించాలన్నారు. ఇకపోతే ప్రజల నుంచి ఇచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఈనెల 9వతేదీలోపు మిషన్ అంత్యోదయకు సంబంధించి సర్వే ఫారాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆరోజు ప్రధానమంత్రి యాప్ ఓపెన్ చేసినప్పుడు అందులో నమోదు చేయాలన్నారు. దీనికి సంబంధించిన గ్రామస్థాయిలో 182 పారామీటర్లు, 91 సెక్టార్లకు సంబంధించి 216 ప్రశ్నావళిని అన్ని శాఖల నుంచి సమాచారం సేకరించుకుని సిద్ధంగా ఉండాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారసింహుని కల్యాణం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం విప్రమలై లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం శనివారం కమనీయంగా సాగింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తిస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం, వేద పండితులు హరిప్రసాద్, భరద్వాజ్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ ఆరాధన మండల దీక్షాహోమం, మాలాధారణ కార్యక్రమాలు నిర్వహించారు. మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం గావించారు. అనంతరం నాగలకట్ట వద్ద ఏర్పాటు చేసినా కళ్యాణ వేదిక లో లక్ష్మీ సమేత నరసింహస్వామిని మాలాదీక్షాపరులు ఊరేగింపుతో మేళతాళాలతో తీసుకుగా శ్రీవారి కల్యాణం నిర్వహించారు. పేద జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. వివాహ జంటలకు మాంగళ్య తాంబూలాలు దండేశ్వర్ రాజు, సత్యనారాయణ కుటుంబ సభ్యులు, వెంకటేశులు అందించారు. ఉత్సవాల్లో భాగంగా కళారాధన బాలికల నృత్య రూపక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళు శిల్ప, కౌన్సిలర్లు హాజరై స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారులు సత్యనారాయణ, నరసింహులు, కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ వెంకటేశులు, సభ్యులు గుర్నాథ్ రెడ్డి, రామిరెడ్డి, కమలాక్షుడు, బాలయ్య, వెంకటరెడ్డి, చిన్నతిప్పేస్వామి, నరసింహులు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-గుత్తి

పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారులు యల్లప్ప, దేవేంద్రనాయక్ తెలిపారు మండలంలోని బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల్లో కౌమార బాలికల వ్యక్తిగత శుభ్రతపై శనివారం సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ13 నుంచి 19 సంవత్సరాలు కౌమార బాలికల నెలసరి రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సర్వేలో అత్యధికంగా వెనుకబడిన ప్రాంతమైన మండలంలోని బేతాపల్లి ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. మూడు రోజులు సర్వే చేసి 120 మంది బాలికల సారాంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్తియ కార్యక్రమం అధికారి డాక్టర్ జి నారాయణస్వామి, సూపర్వైజర్లు లాజరస్, వెంకటరమణమ్మ, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

దేశంలో దుర్మార్గ పాలన

ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెవి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంతకల్లు



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెవి.వెంకటేశ్వర్లు

ప్రధాని మోడీ సారథ్యంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశంలో దోపిడీ, దుర్మార్గ పాలన సాగిస్తోందని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెవి.వెంకటేశ్వర్లు, ఒపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.రామ్‌కుమార్ విమర్శించారు. శనివారం స్థానిక గుంతకల్లప్ప స్వామి కళ్యాణ మండపంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా అధ్యక్షుడు బి.సురేష్ అధ్యక్షతన ప్రథమ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులు, చట్టాలపై ఉక్కుపాదం మోపుతూ అణిచివేయడానికి కుట్రలు చేస్తోందన్నారు. ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీలు, బహుళ జాతి కంపెనీలు, బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్ పాలనలో అనేక కేంద్ర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మోడీ ప్రభుత్వం వచ్చాక గడిచిన 8 ఏళ్లలోనే ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదాని వంటి కార్పొరేట్ దిగ్గజాలకు అతి తక్కువ ధరలకు కట్టబెడుతోందన్నారు. అంతేగాకుండా పేద మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారాలను మోపుతోందన్నారు. బ్యాంకులకు కన్నాలు వేసి ప్రజాధనాన్ని దోచుకెళ్తున్న దొంగలకే మోడీ ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని మోడీ దుర్మార్గ పాలనను ఓటు అనే వజ్రాయుధంతో భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్, సిటిజన్ ప్రోగ్రెసివ్ ఫోరం కార్యదర్శి తారకేష్, మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, ఐఎఫ్‌టియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శిలు శ్రీరాములు, చిన్నా, పట్టణ అధ్యక్షుడు, హనుమంతు, షేక్షా, రఘునాథరెడ్డి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలో అజయగోష్ కాలనీ, వికలాంగుల కాలనీ, వికాస్ కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల కాలనీలో లక్ష్మీదేవి, కళావతి తమ భర్త చనిపోయి చాలాకాలమైందని, అయితే డెత్ సర్టిఫికెట్ ఎలా చేయించుకోవాలో తెలియదని చెప్పడంతో సచివాలయ సిబ్బందితో మాట్లాడి అప్పటికప్పుడు సర్టిఫికెట్ చేయించడమే కాకుండా వారికి వితంతువు పింఛన్ కూడా మంజూరు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు. పేదల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం తమదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి చంద్ర, సర్పంచి పద్మావతి, ఎంపిటిసి మహబూబీ, సచివాలయాల కన్వీనర్లు ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్లు గౌస్ బేగ్, శ్రీదేవి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కుళ్లాయప్ప, గోవింద్‌రెడ్డి, పురుషోత్తం, తిరుపతిరాయుడు, గోపాల్‌రెడ్డి, పలువురు వార్డ్ మెంబర్లు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

దండు శీనాకు పితృవియోగం

ప్రజాశక్తి-శింగనమల



దండు ఆదిమూర్తికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులుకు శనివారం పితృవియోగం జరిగింది. మండల పరిధిలోని చింతలమేకలపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న దండు శ్రీనివాసులు తండ్రి దండు ఆదిమూర్తి (78) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. దీంతో శనివారం ఉదయం మృతదేహాన్ని సొంతూరు చింతలమేకలపల్లికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ జెడ్పిటీసీ రామలింగారెడ్డి, మాజీ ఎంపిపి ముంటిమడుగు శ్రీనివాసులురెడ్డి, ఆకుల ఆంజినేయులు, ఆకుల విజయకుమార్ (బాబు), తరిమెల రంగారెడ్డి, సి.వెంకటేష్, కురబ సాధికార రాష్ట్ర కన్వీనర్ గంగులకుంట రమణ, నరసప్ప, తదితరులు ఉన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం..

మాణిక్య రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు



విలేకరులతో మాట్లాడుతున్న రంగనాథస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన మాణిక్య రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు గ్రామంలోనిరంగ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ కమిటీ ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షులు జీవి.రామన్, ప్రధాన కార్యదర్శి జయవరం అశ్వర్థ రంగయ్య దేవస్థాన అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యుల సహకారంతో అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఆలయం, కళ్యాణ మంటపం, మూలవిరాట్ ఉత్సవ విగ్రహాలు, రథానికి రూ.3.50 లక్షల వ్యయంతో విశేష పుష్పాలంకరణ చేపట్టామన్నారు. విరాళాలతో మూడు రోజుల పాటు అల్పాహారం, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. తిరునాళ్లలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. రంగనాథ స్వామి కొండపైకి భక్తులు వెళ్లడానికి రూ.85 లక్షలు వెచ్చించి 640 సులువైన రాతి మెట్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాణిక్య రంగనాథస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ముత్యాల బాలమోహన్, సంయుక్త కార్యదర్శి నాగరాజయ్య, నాయకులు జయవరం శేఖర్, ధారా నాగ రంగయ్య, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



నేడు రంగనాథుని రథోత్సవం

బొలికొండ రంగనాథ స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరగనుంది. మాఘమాసాన్ని పురస్కరించుకుని 9రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గజవాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున బొలికొండ రంగనాథ స్వామిని భూదేవి, శ్రీదేవిలతో కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తామని ఆలయ కార్య నిర్వహణ అధికారి వి.దేవదాసు తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, గుత్తి సీఐ ఎం. వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని యువకుడు మృతి

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని చిక్క వడియార్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినటన్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చెరువుకు వెళ్లి పరిశీలించగా చెరువు వద్ద ఉన్న దుర్గమ్మ గుడి ఎదురుగా నీటిలో తేలియాడుతూ మృతదేహం కనిపించినట్లు తెలిపారు. యువకుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. వివరాలు తెలిస్తే ఎస్ఐ సెల్ నంబర్ 70130 64687కు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

టీ కేఫ్‌లో చోరీ

గుత్తి : పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో ఉన్న బికెఆర్ సప్లయర్స్, టీ కేఫ్ లో శుక్రవారం చోరీ జరిగింది. గుంతకల్లు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బొలికొండా రెడ్డి అనే వ్యక్తి కొన్నాళ్లగా గుత్తిలో సప్లయర్స్ తోపాటు టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి దుకాణం వెనుక వైపున కన్నం వేసి లోనికి ప్రవేశించారు. దుకాణంలో ఉన్న రూ.25వేల నగదు సిగరెట్ బండిళ్లు ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీటి కుంటలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

గుత్తి : పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న నీటి కుంటలోకి శనివారం ఓ ద్విచక్ర వాహనం దూసుకెళ్లింది. పత్తికొండకు చెందిన రామచంద్ర పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో కాసేపల్లి గ్రామ సమీపంలో ఉన్న టోల్ ప్లాజా వద్దకు వచ్చాడు. అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి నీటి కుంటలో పడింది. గమనించిన స్థానికులు తాళ్ల సాయంతో రామచంద్రను, ద్విచక్ర వాహనాన్ని బయటకు లాగారు. ద్విచక్రవాహన దారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

ఉరవకొండ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటితోపాటు నిత్యావసర సరుకులు దగ్ధమైన ఘటన విడపనకల్ మండల పరిధిలోని హావలిగి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు మీసాల ఓబులేసు, లక్ష్మి దంపతులు తెలిపిన వివరాల మేరకు శనివారం ఉదయం పదిగంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిందన్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని బియ్యం, బ్యాళ్లు వంట సామగ్రితోపాటు బీరువాలోని దుస్తులు, రూ.60వేలు విలువజేసే వస్తువులు నష్టం వాటిల్లిందని తెలిపారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించడంతోపాటు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గీతమ్మ, వైసిపి నాయకులు రఘురాములు, ఆంజనేయులు, స్వామి, యల్లప్ప, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పిఎస్‌లో ఘనంగా సైన్స్‌ఫేర్



సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌పిఎస్ యాజమాన్యం

శింగనమల : థింక్ ఫర్ ఇండియా ఫెస్ట్‌లో భాగంగా మండలంలోని లోలూరు క్రాస్ వద్ద ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రాజెక్టు నమూనాలను సృజనాత్మకంగా ప్రదర్శించారు. అలాగే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడేటట్లు వేషధారణలు ధరించి అందరినీ అబ్బురపరిచారు. వీటిని తిలకించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు అత్యదిక సంఖ్యలో తరలివచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎం.రామసుబ్బారెడ్డి, సిఇఒ.ప్రతాప్‌రెడ్డి, ఎజిఎం.శంకర్ నారాయణ, ప్రిన్సిపాల్ ఫైజియా భాను, అధ్యాపక, అధ్యపకేతర బృందం పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.జి.యు కెటి ఇన్‌ఛార్జి ఉపకులపతి విజయకుమార్

అనంతపురం : విద్యార్థులు ఇష్టంతో బి.ఫార్మసీ విద్యను అభ్యశించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆర్.జి.యు కెటి ఇన్‌ఛార్జి ఉపకులపతి విజయకుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఓటీపీఆర్ ఐ కళాశాలలో ఓటీపీఆర్ ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన 2022 బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థులకు స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులు కు 2021 బి.ఫార్మసీ విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఫార్మసీ రంగ నిరంతరం అభివృద్ధి జరుగుతున్న దశలో బి.ఫార్మసీ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యశించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరికీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమములో ప్రిన్సిపాల్ గోపీనాథ్, విద్యార్థులు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ శుద్ధ జలం

అనంతపురం సిటీ : ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి శుద్ధజలం సరఫరా చేయడమే లక్ష్యమని సర్పంచి ఎం.లక్ష్మికళ అన్నారు. జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్, రైజెస్ ఎన్జీఓ సంయుక్తంగా అనంతపురం రూరల్ మండలం కామారుపల్లిలో వందశాతం కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని తీసుకొచ్చాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆవాసాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమశాలలతోపాటు ప్రభుత్వ సంస్థలకు నీటి కనెక్షన్లు అందించడానికి రాష్ట్రీయ జల్ జీవన్ కోష్ నిధిని ప్రారంభించాయన్నారు. ఈ నిధికి వ్యక్తులు, సంస్థలు, విదేశాల్లో ఉంటున్న వారు ఎవరైనా చందాలు ఇవ్వవచ్చన్నారు. అనంతరం ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి అందించినట్లుగా రైజెస్ స్వచ్ఛంద సంస్థ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరెడ్డికి హర్ ఘర్ జల్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, జెజెఎం ఐఎస్ఎ జిల్లా ఆర్డినేటర్ నరేష్, ఆర్‌డబ్ల్యుఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, రైజెస్ ఎన్జీఓ ఐఇసి ఎక్సపర్ట్ కమ్మూరు శీనా, సోషల్ డెవలప్‌మెంట్ ఎక్సపర్ట్ ఓబులపతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బంది శ్రీపతి, అనిల్, గాయత్రి, వినోద్, వినీత, అంగన్‌వాడీ కార్యకర్త మునీశ్వరి, ఆశా కార్యకర్త పుష్పావతి, వీడబ్ల్యూఎస్సీ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ అధికారులు